

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### భాగ్యనగరం ఎండాకాలం ముచ్చట్లు

**ఒకప్పుడు ఆంధ్రా నుండి హైద్రాబాద్** రావడం అంటే ఎండాకాలంలో ఏ ఊటీనో వెళ్ళినట్లు ఫీలయ్యేవారట. అంత చల్లగా వుండేది నైజాం అంటారు. అసలు నైజాం అని పిలుచుకునే ఈ హైదరాబాద్ చరిత్ర కూడా చాలా విచిత్రం. బ్రిటీష్ వారిని పోరాడి వెళ్ళగొట్టి, దేశం అంతా స్వాతంత్ర సంబరాలు జరుపుకుంటున్నా, ఇక్కడ నవాబు హైదరాబాద్‌ని పాకిస్తాన్‌లో కలుపుతా అనడమే కడు విచిత్రం . ఆ పాత నవాబు ఛాయలు ఈనాటికీ పాత బస్తీని వదిలిపోవడంలేదు.

పాత బస్తీ అంటే చార్మినార్ నుండి ఆ పైకి. మోతీగల్లీ, లాడ్ బజార్, మదీనా, పత్తర్ గట్టీ, షా ఆలీ బండ (పట్నంలో శాలిబండ అనే పాట వినే వుంటారుగా అదే ఈ షాలిబండ) యాకుత్‌పురా, దబీర్ పురా, మొఘల్ పురా, అఫ్జల్‌గంజ్, అలాగే మలక్‌పేట, బహదూర్‌పురా, చంద్రాయణ గుట్టా, ఫలక్‌నుమా, కార్వాన్, ధూల్‌పేట, బేగం బజార్, నాంపల్లిలో కొంత భాగం, చంచల్ గూడా, చాదర్ ఘాట్.

ఈ ప్రాంతాలన్నీ సాధారణంగా ఇరుకు ఇరుకుగా, చారిత్రక భవనాలకూ, సాంప్రదాయ వ్యాపారాలకూ ప్రసిద్ధి.

చిన్నప్పుడు సినిమాలు చూసి, సాయంత్రాలు కొన్ని వీధుల్లోకి వెళితే అత్తరు పరిమళంతో, తబలా వాయిద్యాలతో, ముజ్రాలు చేస్తూ, నర్తకీమణులు కనిపిస్తారేమోనని ఊహించేదాన్ని. నాకు తెలిసి అంత విలాసవంతమైన భవనాలు కానీ, పబ్లిక్‌గా ముజ్రాలు కానీ జరగవు.

కానీ నాకు పది, పదకొండు ఏళ్ళున్నప్పుడు అమ్మమ్మతో పూసల గల్లీ, మోతీ గల్లీల్లో నడుస్తూ, అక్కడున్న ఆవిడ పెన్షన్ ఆఫీస్‌కి ఆవిడ కొంగు పట్టుకుని వెళ్ళడం గుర్తు. అక్కడ ఇలాంటి స్వాతంత్ర సమరయోధుల, వితంతు స్త్రీలు ఓ పెద్ద ప్రాంగణంలో, కింద కూర్చుని, సీసాలతో మంచినీళ్ళూ, పక్కన ఇంటినుండి తెచ్చుకున్న పలహారం చేస్తు, పడిగాపులు పడ్తూ తమ పేరు పిలవడం కోసం ఎదురు చూసేవారు. ఆచారపరురాలైన మా అమ్మమ్మ నాకు అక్కడ వేరుశనగ గుళ్ళు తప్ప ఏమీ కొనిపెట్టేది కాదు. కానీ సాయిబులు అమ్మే సమోసాలు ఘుమఘుమలాడ్తూ, ముక్కులు అదిరేటట్లు చేసేవి. ఒక సాయిబులు బామ్మ అమ్మమ్మకి బాగా స్నేహం అయింది.

ఖాతూం బీవీ ఆవిడ పేరు "రమణమ్మా చాయ్ తాగు. నీళ్ళూ, పాలూ, షక్కర్ చాపత్తా అంతే కదా!" అని బలవంతం చేస్తే, నాకు ఇమ్మనేది అమ్మమ్మ. అప్పటి నుండే చాయ్ బిస్కెట్ అంటే ఉస్మానియా బిస్కెట్లు, చాలా బావుండేవని అర్థమైంది నాకు. రంజాన్, బక్రీద్‌లకి మా రయిసా ఇంట్లో చేసే షీర్ కుర్మా అంటే పడి చచ్చేదాన్ని. ఇంట్లో చెప్పేదాన్ని కాదు .ఇప్పటికీ అక్కడ దొరికే 'ఖుబానీ కా మీఠా, డబల్ క మీఠా' ఇక్కడ దొరకవు.

ఎంత ఇరుకు ఇరుకు వీధుల్లో నుండి నడుస్తున్నా, వాళ్ళు చేసే కళాకృతులూ, చేతి పనులూ, ముఖమల్ తివాచీలూ, గాజుల తయారీ, ముఖ్యంగా మోతీగల్లీలో ముత్యాల పనితనం, చెప్పుల మీద చెంకీలూ, రాళ్ళ నగలూ, తివాచీల మీద లతలూ, చెక్క మీద తీగలూ, లతలూ చెక్కడం, విఠాయిల మధ్య వేసే వెండి కాయితాలు చిత్రిక పట్టడం నిరంతరం ఉలితో సుత్తితో కొట్టే దెబ్బలు నేపథ్య సంగీతం అయివుండేవి.

ఏ చాయ్ దుకాణం దగ్గరో ఆగితే, 'మొహబత్ కి ఝూటీ కహానీ పే రోయీ...' అనో "ప్యార్ కియాతో డర్ న క్యా?" అనే పాటలో మంద్రంగా వినిపిస్తూ వుండేవి.

మేం 2008లో అందరి బంధువయా సినిమా షూటింగ్‌ను (నేనే కథ మాటలూ రాసాను) మెహదీపట్నం దాటాక, డాగ్ ఘర్' అన్న బంగళాలో చేసాం. వరుసగా, చాలా రోజులు చేసాం. అదే హీరోయిన్ ఇల్లుగా, అందులో అనేక వాటాలు ఇతరులకి అద్దెకిచ్చే యజమానురాలిగా, పద్మప్రియని చూపించాం. అందులోనే శర్వానంద్ కూడా, (ఫ్రెండ్ అయిన కమేడియన్ విజయ్, ఇప్పుడు లేదు పాపం)తో వున్నట్లు చూపించాం.

"ఓ మెహల్ లోని మైనా మైనా
రహస్యాన్ని చెప్పేసెయ్‌నా, మహా మహా
సంతోషాన్ని నీలో నీలో నింపెయ్యనా
జిగిబిగి చిలకా జిగేలు చిలకా
రాజకుమారుడు వస్తాడే!
చక్కనైన వరుడూ, ఇష్టమైన గురుడూ
పెళ్ళి కుమారుడు అవుతాడే!"

అనే ఈ పాట యూట్యూబ్‌లో కొట్టి చూడండి ఆ పాత ముస్లీంల కట్టడాలు, లోపల అనేక పరదాల చాటు వాటాలూ, మహల్‌లో గదుల నిర్మాణం, మెట్లూ, లోపల చావిడీ అన్నీ వివరంగా కనిపిస్తాయి. నవాబులు చాలామంది, తమ నవాబ్‌గిరీలు పోయాక, తమ దగ్గర పనిచేసేవారి పేర్లమీద ఈ బంగళాలు రాసి పారిపోయారని చెప్తారు. ఈ డాగ్ బంగళాలో కుక్కల్ని పెంచే వాళ్ళు వుండేవారనీ, అందుకే ఆ పేరు వచ్చిందనీ చెప్తారు.

అలాగే రిసాల గడ్డ, అనే ఏరియా దగ్గర మేం పెరిగిన ఆర్.టీ.సీ కాలనీకి కూడా దగ్గరగా దాయర్ మార్కెట్, రహత్ మహల్, రిసాలా బజార్లాంటి ముస్లీంలుండే ఏరియాలుండేవి. మాతోవాళ్ళు చాలా బాగా వుండేవారు. మేం చిన్నప్పుడు ఆడుకున్న స్నేహితుల్లో చాలామంది షాహీన్ బానూ, రయిసా బేగం, బదరున్నిసా, సాజీదా, సందానీ, జాఫర్ ఇలాంటి పేర్లున్న వాళ్ళే. సందానీ కథలు మీకు బోలెడు చెప్పేసాను కూడా. వాళ్ళ షీర్ కుర్మాలు మేమూ, మా పులిహోరలు వాళ్ళూ స్కూల్లో పంచుకుని తినేవాళ్ళం. బూబమ్మగారు మధ్యాహ్నాలు వెల్లుల్లిపాయలు వలుచుకుంటూ వస్తే, మా అమ్మమ్మ నవారు మంచం వాలిస్తే, "ఒద్దు పంతులమ్మా! నీకు ఆచారం ఈ ఎల్లిపాయ వాసన పడదు. దూరంగా కూర్చుంటా" అని కూర్చునేది వలుచుకుంటూ. సందానీ తల్లి బీడీలు చుట్టుకుంటూ వచ్చి వేపచెట్టు నీడన కుర్చుని అమ్మమ్మతో కష్టం సుఖం చెప్పుకునేది.

బైబిల్ పట్టుకుని వెళ్తున్న క్రీస్తుమణి టీచర్ కూడా వచ్చి, అమ్మమ్మ వాల్చిన మంచం మీద కుర్చుని, ప్రభువు సూక్తులు ఓ నాలుగు చదివి వినిపించేది. అమ్మమ్మ 'రామకోటి' రాస్తూనో, పూజకు వత్తులు చేసుకుంటూనో అన్నీ వినేది. ఒక్కోసారి శ్రీకృష్ణుడు పుట్టినప్పుడు, ఆ ఈడు పిల్లలందరినీ కంసుడు చంపించడం, గొడ్ల పాకలో ఏసు పుట్టినప్పుడు, దైవకూమారుడు పుట్టినట్లు విని, ఆ ఈడు పిల్లల్ని చంపించడం, ఒకేలా జరిగాయి అని సామ్యం మాట్లాడుకుని "ఎవరైనా దేవుడు దేవుడే!" అని తేల్చేసేవారు.

చార్మినార్ సిగిరెట్ ఫ్యాక్టరీ 'కూత' వెయ్యగానే చాలామంది అవ్వలు బుట్టల్లో కేరేజీలు పెట్టుకుని వెళ్ళేవారు, తమ బుట్టలని మా చెట్టు నీడలోనే దింపేవారు. మిడి వేసవి మిట్ట మధ్యాహ్నం కూడా, వేపాకుల గలగలలతో, ఆ చెట్టు చల్లని నీడనిచ్చేది. అమ్మమ్మ ప్రత్యేకం ఒక పింగిలీ కుండనిండా నీళ్ళు ఆ చెట్ల కింద పెట్టి, కొబ్బరి చిప్పకి కాడ పెట్టి, కుండ మీద వుంచేది. కార్మికులు చేతులూ, కాళ్ళూ కడుక్కుని భోజనాలు చేసి వెళ్ళేవారు.

"యాద్గిరీ, ఆఫ్సర్, రాములూ" అని అందరి పేర్లూ అమ్మమ్మకి బాగా తెలుసు.

తడి బట్టతో గచ్చు తుడిచి, అక్కడ పచ్చీస్, వామన గుంటలూ, అష్టాచెమ్మా, చింతపిక్కలాటా ఆడేవాళ్ళం. చిన్న చిన్న పిల్లలు బట్టలు విప్పేసి లాగూలతో ఆడేవారు.

అమ్మ "నూజివీడు రసాలూ , బంగినపల్లి మావిడి పండ్లూ" బుట్టలతో తెప్పించేది. పిల్లలందరం, అవి తెగ తినేవాళ్ళం, మధ్యాహ్నాలు ఆకులు జెండాలా బుట్ట చుట్టూ పెట్టి, నీళ్ళు జల్లుతూ, ముంజెలు తెచ్చేవారు. చల్లని ఆ తాటి ముంజెలు స్వర్గం తలపించేవి. రేగి పళ్ళు, సపోటా పళ్ళూ, జీడి మామిడి పళ్ళు, పనస తొనలు, అనాస ముక్కలు.. ఏం వచ్చినా వాకిట్లోకి కొనాల్సిందే. ఇవన్నీ సరిపోనట్లు గంట గణగణ మోగిస్తూ, మిఠాయిల బండి వచ్చేది. అందులో బందరు లడ్లూ, బాదూషాలూ, మైసూర్ పాకం, జీళ్ళూ, కారప్పుసా, బూందీ, పెండలం చిప్స్లాంటివి ఉండేవి. తర్వాత సాయంత్రం ఇద్దరు అరబ్ షేక్ల బట్టల్లో వున్న అందమైన అబ్బాయిలు అద్దాల బండిలో చాంద్ బిస్కెట్స్, ఉస్మానియా బిస్కెట్స్, కాఫీ టాఫీ చాక్లెట్స్, పాలకోవా బిళ్ళలూ తెచ్చి అమ్మేవారు. పొరలు పొరలుగా **విడివడే 'టై'** బిస్కెట్లు అప్పుడే రుచి చూసాం. మా

ఇంటికి ఆంధ్రానుండి వచ్చిన బంధువులకి ఇవన్నీ చాలా విచిత్రాలు. చల్ల బడ్తుంటే "ఆంధ్రా సోడా, గోలీ సోడా" అని అమ్మొచ్చేవి. అప్పుడు మేమూ ఆంధ్రానే, కానీ ఎవరైనా రాజమండ్రీ, గుంటూరూ, వైజాగ్, విజయవాడలనుండి వస్తే, ఆంధ్రా సైడ్ అనీ మాది నైజాం అని అనేవారు ఎందుకో. ఇప్పటికీ పాత సినిమాలు చూస్తుంటే, డిస్ట్రిబ్యూటర్స్, ఆంధ్రా, నైజాం, సీడెడ్ అని అంటారు. సీడెడ్ అంటే రాయలసీమ.

మా పెద్దనాన్నగారు అంటే అమ్మకి అక్క భర్త నరసింహారావ్‌గారు, ఉర్దూ మీడియంలో చదివారు. ఆయన ఉర్దూ చదవడం, మాట్లాడడం చేసేవారు.

మా అమ్మకూడా డబ్బీపురా, ఆగాపురా సైడ్ లోకల్ ట్రైన్‌లో వెళ్ళి చదువుకుంది. ఉర్దూ బాగా మాట్లాడుతుంది. ఆ తర్వాత ఆర్.టీ.సీలో ఉద్యోగం చేసి, ముస్లీం భాయి లైన కండక్టర్లూ, డ్రైవర్లతో ఉర్దూ అనర్గళంగా మాట్లాడడం నేర్చుకుంది. గాయని కూడా కాబట్టి అనార్కలీ, మొగలి అంజం, తాజ్‌మహల్ పాటలు పాడినప్పుడు "ఖత్" "జరూర్" "ఖుఖం" "ఇజాజత్"లాంటి పదాలు అందంగా పలికేది, ఉర్దూలో, పార్శీకంలో మా పెద్దమ్మ కొడుకు అపారమైన జ్ఞానం సంపాదించాడు. హనుమంతు అన్నయ్య ఆ పొయిట్రీ చదువుతూ షాయరీల్లో అందం మాకు వర్ణించేవాడు. నేను పెద్దయ్యే కొద్దీ, ఉర్దూకీ అచ్చ హిందీకీ తేడాలు తెలుసుకుని, ప్యూర్ హిందీ మాట్లాడడం నేర్చుకున్నాను. కానీ చిన్నప్పటి స్నేహితులు కనిపిస్తే, హైదరాబాదీ ఉర్దూ తన్నుకునొచ్చేస్తుంది "క్యారే ఆపా.. బాస్కెట్ మే క్యా లేకే జారే? వా.. కుర్సియాం హైనా బైట్ లేంగే! క్యా పకాయే ఆజ్?" అని అదే హిందీలో "బెహెన్ ఆప్ ఉధర్ కుర్సీ హై. బైఠ్ జాయియే.. ఆజ్ ఖానా క్యా బనా యే ఆప్ నే" ఇలా అనాలి.

హిందీ సీరియల్స్ బునియాద్, హమ్ లోగ్, ఆ తర్వాతొచ్చిన నుక్కడ్, మనోరంజన్, ఫౌజీ, సర్కస్‌లాంటివి రెగ్యులర్‌గా చూడడం వలన మా భాష ఇంప్రూవ్ అయింది. దేశంలో ఏ మూలకి వెళ్ళినా, ముఖ్యంగా నేను నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీల్లో ఉన్నప్పుడు, నా హిందీని ఉత్తరాది వారు చాలా మెచ్చుకునేవారు. ఇప్పటికీ జోక్స్ వేసుకుంటూ, తేజాబ్ డైరెక్టర్ ఎన్. చంద్రగారూ, రాహుల్ రవైల్ లాంటి ఫేమస్ హిందీ సినిమా డైరెక్టర్లతో, మేజర్ రవీలాంటి మలయాళీ నటులూ, మా సహ జ్యూరీ మెంబర్లతో తెగ మాట్లాడుకుంటాం. 'కేరళ స్టోరీస్' రాసిన సూర్య పాల్‌సింగ్ కూడా నాకు మంచి మిత్రుడు. ఇంక కన్నడీగులతో కూడా హిందీనే మాట్లాడవలసి వచ్చేది. తమిళులుకి ఎక్కువగా హిందీ రాదు .1960లలో వాళ్ళకీ, 70 'లలో వాళ్ళకీ, చాలా హిందీ సినిమాలు విజయవంతంగా తీసిన పెద్ద పెద్ద తెలుగు ప్రొడ్యూసర్‌లకి కూడా హిందీ రాకపోవడం, అర్ధం కాకపోవడం నాకు విచిత్రంగా వుంటుంది .మా డా. దగ్గుబాటి రామానాయుడుగారు ఏ భాష అయినా మాట్లేడేవారు, బట్లర్ ఇంగ్లీష్‌లో కూడా కాన్ఫిడెంట్‌గా, అవతలవాడు చచ్చినట్టు అర్ధం చేసుకుని, " ఓకే సర్ ఏజ్ యూ సెడ్" అనేటట్లు, హిందీ వాడు "ఆప్ కీ మర్జీ సర్.. హాం జీ" అనేట్లు దడదడా మాట్లాడేసేవారు. దాన్నే విల్ పవర్, కాన్ఫిడెన్స్ లెవెల్స్ అంటాం మరి.

హైదరాబాద్‌లో ఇప్పుడున్నంత వేసవి తాపం వుండేది కాదు అప్పట్లో. ఎక్కడ చూసినా పచ్చని చెట్లు వుండేవి. ఫలక్ నామా ప్యాలెస్ అందాలు చూస్తే, ఇప్పటికీ తోటలు ఎలా ఉండేవో మనకి తెలుస్తుంది. అరటి, కొబ్బరీ, పనసా తక్కువ కానీ అన్నిరకాల ఫలవృక్షాలూ వుండేవి. ఇప్పుడు అపార్ట్‌మెంట్స్ కల్చర్, స్కై స్క్రాపర్స్ నిర్మాణం కోసం చెట్లు కొట్టెయ్యడం వలన మాకు వేడి పెరిగింది. సమ్మర్‌లో కూడా చెవులకి మఫ్లర్, స్వెట్టర్‌లు వేసుకునేవారు ఒకప్పుడు. ఇప్పుడు ఈ కాంక్రీట్ జంగిల్స్‌లో నిమ్మకాయ పుదీనా సోడాలూ, తాటి ముంజెలూ కోసం వెతకడం, ఎడారిలో నీటి ధారలకోసం వెతకడం లాంటిదే. సిటీ అభివృద్ధి అయింది. అమెరికాని తలపిస్తోంది కానీ హాళీ పైసాలూ.. తర్వాత నయా పైసాలూ అణాలూ ఇరానీ ఛాయ్ 'దూద్ పేడాలూ' వాడిన ఆ రోజులూ ఆ సంస్కృతీ తలచుకుంటే అదొక గొప్ప వైభవం. బాగ్యనగరం అని ఊరికే అనలేదు మరి.

Post your comments







